క్లుప్తంగా

ధ్రువీకరణ పత్రం అందజేయాలి

రఘునాథపల్లి : రుణమాఫీ కానీ, రైతులు తమ కుటుంబ సభ్యుల వివరాలతో కూడిన ధ్రువీకరణ పత్రం అందజేయాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 697 మంది రైతుల కుటుంబ సభ్యుల వివరాలు, ఫొటోతో క్రాప్‌లోన్ యాప్‌లోని గ్రీవెన్స్ కాలమ్‌లో నమోదు చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక్కో రైతు కుటుంబంతో సెల్ఫీ దిగి అప్‌లోడ్ చేస్తామని, ప్రతి రైతు సహకరించాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు రైతులకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

మండల కమిటీ ఎన్నిక



నాగభూషణం లచ్చిరాం

రఘునాథపల్లి : టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా స్థానిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాల్నె నాగభూషణం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జరిగిన టీపీటీఎఫ్ సర్వసభ్య సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, ఎన్నికల అధికారి, రాష్ట్ర కౌన్సిలర్ కుర్రెముల యాదగిరి హాజరై ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా జి.లచ్చిరాం, ఉపాధ్యక్షులుగా రాంమోహన్, వెంకట్రాజయ్య, టి.సారయ్య, మహిళా ఉపాధ్యక్షులుగా కవిత, కార్యదర్శులుగా ఎం. మల్లేశం, జి. రాజేందర్, పి.యాకయ్య, కె.కళింగం, జిల్లా కౌన్సిలర్లుగా సత్యనారాయణ, సంపత్, కార్యవర్గ సభ్యులుగా బి.నరేష్, మారుతి ప్రసాద్, జె. సీతారాం, రవీందర్, భద్రు, గౌరవ సలహాదారులుగా ఉపేందర్, శోభన్‌బాబు ఎన్నికయ్యారు.

టీజీహెచ్‌ఎంఏ మండల కమిటీ..



యాదగిరి రవిశంకర్

లింగాలఘణపురం : తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ (టీజీహెచ్‌ఎంఏ) మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాశికంటి యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా బిట్ల రవిశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని నెల్లుట్ల ఉన్నత పాఠశాలలో జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రభాను ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా మల్లికార్జున్ వ్యవహరించారు.

ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా దేవోజీ..

పాలకుర్తి : ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆదివారం సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గుగులోత్ దేవోజీ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చిట్యాల యాకయ్య, ఉపాధ్యక్షుడిగా చిదిరాల ఎల్లయ్య, కొండపర్తి కృష్ణమూర్తి, వర్ధమాన శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎండి యాకూబ్, సహాయ కార్యదర్శిగా సలేంద్ర సోమన్న, బొమ్మగాని ప్రదీప్, కత్తుల యాకయ్య, కోశాధికారిగా జిలుకర తిర్మల్, గౌరవ సలహాదారులుగా దాసరి యాకయ్య, మామిండ్ల సోమయ్య, బాలగాని రమేష్, రాపోలు రాంబాబు, గుడికందుల నరేష్‌ను ఎన్నుకున్నారు.

క్రాంతి యూత్ అధ్యక్షుడిగా మహేశ్..




పాలకుర్తి టౌన్ : పాలకుర్తి మండల కేంద్రంలోని శాంతి నగర్ క్రాంతి యూత్ అధ్యక్షుడిగా నంగునూరి మహేశ్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా పెనుగొండ సోమేశ్వర్, ప్రధానకార్యదర్శిగా బెల్లి దిలీప్, ఉపాధ్యక్షుడిగా సలేంద్ర శంకర్, బొడ్డన సందీప్, కోశాధికారిగా కమ్మగాని సుధాకర్, సహాయ కార్యదర్శిగా చిట్యాల సాయి,సలహామండలి సభ్యులనుఎన్నుకున్నారు.

విద్యుత్ దీపాల అందజేత



బచ్చన్నపేట : మండలంలోని కొన్నె పంచాయతీకి సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్ గౌడ్ విద్యుత్ దీపాలు అందజేశారు. ఆదివారం గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌కు విద్యుత్ బల్బులను అందించిన అనంతరం మాట్లాడారు. గ్రామస్తులు బోనాలు చేస్తారని రాత్రి వేళ వెళ్లేందుకు వీధి లైట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గ్రామం అంధకారంలో ఉందని అందుకే సొంత ఖర్చులతో విద్యుత్ లైట్లను అందించానని తెలిపారు.

'మన్‌కీ బాత్ వీక్షణ'



జఫర్‌గఢ్ : దేశ ప్రజలకు మంచి సందేశాన్నిచ్చేందుకు ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని పార్టీ కార్యకర్తలతో కలిసి వీక్షించారు. గొప్ప విషయాలను నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. నాయకులు నేరెళ్ల రాజు, మోడం అరవింద్, గణేష్, సింగారపు రమేష్, లింగన్న, సందీప్, గాదెపాక శ్రీనివాస్, రడపాక నరేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

చెరువు నిండదు.. పంట పండదు

- కార్తెలు పోతున్నా.. కానరాని వానలు
- ఆందోళనలో అన్నదాతలు


పూర్తిస్థాయిలో నిండని జఫర్‌గఢ్ పెద్ద చెరువు

జఫర్‌గఢ్ : బలమైన కార్తెలు ఒక్కొక్కటి దాటుపోతున్నా అనుకున్న స్థాయిలో భారీ వర్షం పడలేదు.. వానాకాలం సీజన్ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు మండలంలో సరైన వర్షాలు లేక చెరువులు, కుంటలు మత్తడి పడలేదు.. ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం కూడా నమోదు కాని పరిస్థితి. అదను దాటుతున్న చెరువులు, కుంటల్లోకి నీరు రాకపోవడంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. జఫర్‌గఢ్ మండలం పూర్తిగా మెట్ట ప్రాంతం.. దీంతో ఎక్కువ శాతం మంది రైతులు చెరువులు, కుంటల కింద ఆధారపడి వరి పంటను సాగు చేస్తున్నారు. వీరిలో అధిక శాతం మంది చిన్న, సన్నకారు రైతులే.. మండలంలో మొత్తం 13 చెరువులతో పాటు చిన్న, పెద్దవి మొత్తం 88 కుంటలు ఉన్నాయి. వీటి పరిధిలో 940 హెక్టార్లకు పైగా వరి సాగు కావాల్సి ఉంది. ఇప్పటికే చెరువులు, కుంటలు నీటితో నిండుకుండలా ఉండాల్సింది. కానీ కొద్దిపాటి నీరు మాత్రమే వచ్చి చేరడంతో పంటలు సాగు చేసేదెలా అంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఆలస్యంగానైనా వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు నిండి మత్తళ్లు సైతం పోశాయి. ఈ సారి వరుణుడు కరుణించకపోతాడా సమృద్ధిగా వర్షాలు కురవక పోతుందా.. చెరువు, కుంటల కింద మళ్లీ పంటలు పండకపోతాయా అని గంపెండాశతో ఉన్న రైతులకు నిరాశే మిగులుతుంది. ఇప్పటికే ముఖ్య కార్తెలు రోహిణి, మృగశిర, ఆరుద్ర, పెద్దపూసాల, మాఘం దాటిపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వర్షాల కారణంగా వ్యవసాయ బోరు బావుల్లో నీటిమట్టం కూడా పెరగలేదు. గతేడాది రైతులు రెండు పంటలు సాగుచేసినప్పటికీ ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. మండలంలో అతిపెద్ద చెరువు జఫర్‌గఢ్ ఊర చెరువు 850 ఎకరాల ఆయకట్టును కలిగిఉంది.14 ఫీట్ల సామర్థ్యంతో ఉన్న ఈ చెరువులోకి ఇప్పటి వరకు కేవలం 4 ఫీట్ల నీరు మాత్రమే వచ్చి చేరింది.దీంతో కనీసం ఒక పంటకు సరిపడ నీరు కూడా రాకపోవడంతో దుక్కులు దున్నక పంట పొలాలు బీడు భూములుగా మారుతున్నాయి. ఆలస్యంగానైనా వర్షాలు కురవకపోతే చెరువులు నిండక కనీసం వచ్చే యాసంగి పంట సాగు చేయని పరిస్థితి.దీంతో తిండిగింజలకు ఇబ్బంది పడాల్సి వస్తుందని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆశించిన వర్షాలు పడలే..



వానాకాలం మొదలైన కూడా సరైన వర్షాలు లేక చెరువులోకి పెద్దగా నీరు రాలేదు. ఇప్పటికే చెరువు కింద వరి నాట్లు వేయాల్సి ఉంది,. కాని వర్షాలు లేక, చెరువులోకి నీరు రాకపోవడంతో దుక్కులు దున్నలేదు, నార్లు పోయలేదు. ఆలస్యంగానైనా వర్షాలు పడితే వచ్చే యాసంగివరకు చెరువు కింద ఒక పంట సాగు చేసే అవకాశం ఉంటుంది. లేకుంటే తిండిగింజలకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

-ఎల్లయ్య, రైతు, వడ్డెగూడెం


'కేసులకు భయపడేది లేదు'

జనగామ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులపై రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతోందని మున్సిపల్ కోఆప్షన్ స్టేట్ ఉపాధ్యక్షుడు మసిఉర్ రెహమాన్, పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్ అన్నారు. ఆదివారం వారు జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని లొంగదీసుకునే ప్రయత్నంలో అక్రమ కేసులు, కూల్చి వేతలంటూ కొత్త చరిత్రకు నాంది పలుకుతుందన్నారు. అనురాగ్ యూనివర్సిటీకి గత సర్కారు హయాంలో అన్ని అనుమతులు తీసుకున్నా, వాటిని పరిశీలించకుండా నోటీసుల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఎమ్మెల్యే పల్లాకు జనగామ నియోజకవర్గ పార్టీ శ్రేణులు, ప్రజలు అండగా ఉంటారన్నారని తెలిపారు. ప్రతిపక్షంలోనే ఉంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసే దమనకాండను ప్రజా క్షేత్రంలో పోరాటం చేసి ఎదుర్కొంటామన్నారు. రైతులకు పంట రుణమాఫీ చేసే సమయంలో విఫలమైన ప్రభుత్వం, హైడ్రాతో రైతులు చేస్తున్న ఆందోళనలను దారి మళ్లించేందుకు ఇలాటి కుట్రలకు తెర లేపారన్నారుజ

నిలదీస్తున్నందుకే ఎమ్మెల్యేపై కేసులు

బచ్చన్నపేట : ప్రభుత్వ వైఖరిని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నిలదీస్తున్నందుకే ఆయనపై అక్రమంగా కేసులను బనాయిస్తున్నారని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ప్రకటనలో విడుదల చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో కేసులను ఎదుర్కొని జైలుకు వెళ్లిన నేత అని అన్నారు.

అటెన్షన్ ప్లీజ్



విద్యుత్ లైన్ ఎత్తు పెంచరూ..?

మండలంలోని మేకలగట్టు–గిద్దబండతండా గ్రామాల మధ్య నూతనంగా బ్రిడ్జి నిర్మించారు. దీంతో పైన ఉన్న విద్యుత్ మెయిన్ లైన్ కిందకు రావడంతో ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జి నిర్మాణంతో మెయిన్ లైన్ కిందకు వేలాడుతుండడంతో ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు.

- రఘునాథపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
ఎం.రవీందర్, విద్యుత్ శాఖ, ఏఈ
ఫోన్‌నంబర్ : 94910 58648

బీపీ మండల్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

చిల్పూరు : బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని పాటుపడిన వ్యక్తి బిందేశ్వర ప్రసాద్ మండల్ యాదవ్ అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాండ్ల దేవేందర్ అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాలలో ఆదివారం బీపీ మండల్ యాదవ్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బత్తుల రాజన్‌బాబు అధ్యక్షతన నిర్వహించగా దేవేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంటి ఉపేందర్ యాదవ్, దళిత సంఘాల రాష్ట్ర నాయకుడు ఇల్లందుల సుదర్శన్, నాయకులు ముక్కెర శ్రావణ్, అశోక్, రాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

- ఎమ్మెల్యే శ్రీహరికి గ్రామస్తుల వినతి

చిల్పూరు : మండలంలోని నష్కల్ గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ సర్పంచ్, ఎంపీటీసీ కర్ణకంటి స్వప్నవెంకటేష్, పాశం శిరీషసురేష్‌ల ఆధ్వర్యంలో ఆదివారం గ్రామస్తులు హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి విన్నవించారు. ఈసందర్భంగా ఆకేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తే వాగు అవతల ఉన్న రైతులు పొలాల వద్దకు వెళ్లాలంటే 15 కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లాలని తమ ఆవేదనను వెలిబుచ్చారు. అందుకు బ్రిడ్జి నిర్మాణం, ఎస్సీలకు చెందిన శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన కడియం ప్రస్తుతం నిధులు లేనందున సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మోడెం భిక్షపతి, స్వామి, కూరపాటి సాంబయ్య, వంగాల భాస్కర్ రెడ్డి, నాగులు, రాజు, వేమన, ఆరోగ్యం, శ్యాంసుందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

స్టేషన్‌ఘన్‌పూర్ : నిషేధిత గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్న గాండ్ల చిరంజీవి, గుగులోత్ హరిసింగ్ వద్ద నుంచి వాటిని పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు. ఘన్‌పూర్‌లోని కిరాణా షాపులు, పాన్ షాప్‌లను తనిఖీ చేస్తుండగా చిరంజీవి, హరిసింగ్ వద్ద రూ.10వేలు విలువైన గుట్కా ప్యాకెట్లను దొరికినట్లు, వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా గుట్కాలు విక్రయిస్తే చట్టపరంగా తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాపర్ వైర్ చోరీ

లింగాలఘణపురం : మండల కేంద్రంలోని ఎస్‌ఎస్–64, 66 నంబర్లు గల 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్‌ను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్‌ను అపహరించారు. సుమారు రూ.60వేల విలువైన నష్టం జరిగిందని ఏఈ శంకరయ్య పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బిర్యానీ సెంటర్లలో తనిఖీ

తరిగొప్పుల : మండలంలోని బిర్యానీ సెంటర్లలో మద్యం తాగితే చర్యలు తప్పవని ఎస్సై శ్వేత హెచ్చరించారు. ఈమేరకు ఆదివారం మండలంలోని పలు బిర్యానీ సెంటర్లలో తనిఖీ చేపట్టారు. బిర్యానీ సెంటర్లకు వచ్చే కస్టమర్లతో పాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దన్నారు.

పేదల సంక్షేమానికి కృషి

జఫర్‌గఢ్ : పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్ రావు పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో భాగంగా ఆదివారం మండలంలోని ఓబులాపూర్, మగ్దుంతండాల్లో పార్టీ యువజన కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు.

గణేష్ ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు

లింగాలఘణపురం: గణేష్ ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని రఘునాథపల్లి సీఐ శ్రీనివాసురెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. రాబోయే గణేష్ ఉత్సవాల నేపథ్యంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ కమిటీలకు పలు సూచనలు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో తప్పకుండా అనుమతి తీసుకోవాలని, ప్రజలు నడిచే దారిలో మండపాలను ఏర్పాటు చేయొద్దని, ముగ్గురు వలంటీర్లు 24 గంటలు అందుబాటులో ఉండాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

పేకాటరాయుళ్ల అరెస్ట్



కొడకండ్ల : మండలంలోని రామన్నగూడెంలో పేకాట ఆడుతున్న పదిమందిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు దేవరుప్పుల ఎస్సై సృజన్, ఏఎస్సై కత్తి రమేష్‌గౌడ్ తెలిపారు. రామన్నగూడెం శివారులో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు దాడి చేసి కున్‌సోత్ కిషన్, బాషపాక నర్సింహస్వామి, ఎరుకల శ్రీనివాస్, చెవిటి జాషువా, మద్దూరి ఉమేష్, మేకల రవి, యాట వెంకన్న, పిట్టల శ్రీను, నారగోని సోమయ్య, గుగులోత్ కిషన్ నాయక్‌ను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.26,760 నగదును స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి స్వాగతం

దేవరుప్పుల / పాలకుర్తి : విదేశీ పర్యటన ముగించుకుని స్వదేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి దంపతులకు పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

కొడకండ్ల : ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పేరం రాము కోరారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. దయాకర్‌రావు మంత్రిగా ఉన్నప్పుడు మంజూరు చేసిన పనులు ప్రారంభించడం తప్ప కొత్తగా నిధులు ఏమి తేలేదని ఆయన విమర్శించారు. రైతులు రుణమాఫీ కాక బ్యాంకులు, వ్యవసాయాధికారి చుట్టూ తిరుగుతుంటే కాంగ్రెస్ నాయకులు మాత్రం పాలాభిషేకాలు, కేక్ కట్ చేస్తూ సంబురాలు చేయడం సిగ్గుచేటన్నారు.

ఓటరు జాబితా సవరించాలి


జాబితాను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మల్లికార్జున్

బచ్చన్నపేట : మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటర్ల జాబితాను సవరణ చేయాలని ఎంపీడీఓ మల్లికార్జున్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు ఓటరు జాబితాను సవరణ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు ఓటరు జాబితాలోని తప్పు ఒప్పులను సవరణ చేయాలని ఆదేశాలను జారీ చేసిందన్నారు. దాని ప్రకారం నూతన ఓటర్లను నమోదు చేస్తూ, మరణించిన వారి పేర్లను తొలగిస్తూ, కుటుంబ సభ్యుల మొత్తం పేర్లను వరుస క్రమంలో నమోదు చేస్తున్నామని అన్నారు. ఓటరు జాబితాల సవరణ పూర్తి చేసి త్వరలో ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రదర్శనకు ఉంచుతామని అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తామని తెలిపారు. ఆదివారం సెలవు అయినా పనుల సులభతరం కోసం విధులు నిర్వర్తిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అనిల్ రాజ్, బృంగి రూపాచైతన్య, ప్రశాంత్ ఆచార్య, భరత్‌కిషోర్, కారోబార్లు కొమురెల్లి శ్రీనివాస్, ఎర్రోజు శ్రీనివాస్, మల్లేశం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


చిల్పూరు: చిన్నపెండ్యాల.. సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


జఫర్‌గఢ్ కూనూర్ పాఠశాలలో 1999-2000 బ్యాచ్ విద్యార్థులు

చిల్పూరు : మండలంలోని చిన్నపెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993–94లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుఆనంద్, వెంగల్‌రెడ్డి, రాధిక, సంపత్, పూర్వ విద్యార్థుల కమిటీ బాధ్యులు తాళ్లపల్లి శివకుమార్,బాబు, భూక్య సుధాకర్, రవి, కృష్ణ, రమేష్, రాజమోహన్, గంటి ఉపేందర్, పేరాల రాజన్‌బాబు, ఇల్లందుల యాదగిరి, పుల్యాల రాజు, నంగునూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

జఫర్‌గఢ్ : మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 1999–2000 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 24 ఏళ్ల తర్వాత పాఠశాల వేదికగా కలుసుకొని తమ చిన్ననాటి అనుభవాలు పంచుకుంటూ ఉద్వేగానికి గురయ్యారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారు సమ్మేళనంలో ఒకే చోట కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు పేర్కొంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం అప్పటి గురువులను పూర్వ విద్యార్థులు శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు శాస్త్ర బోయిన సంపత్, శానబోయిన రాజు, గుండు రాంప్రసాద్, మూల క్రాంతికుమార్, ఇల్లందుల సంపత్, బొమ్మినేని మధుసూదన్‌రెడ్డి, కుంట అశోక్, రడపాక రవీందర్, లింగారెడ్డితో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు


స్టేషన్‌ఘన్‌పూర్ : శివునిపల్లి పోచమ్మ గుడి వద్ద భక్తులు


జనగామ రూరల్: క్యూలో మహిళలు


లింగాలఘణపురం: బోనాలతో వెళ్తున్న మహిళలు

జనగామ రూరల్: మండలంలోని శామీర్‌పేటలో ఆదివారం ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ తల్లి బోనాలు సమర్పించారు. మత్స్య పారిశ్రామిక సహకర సంఘం జిల్లా డైరెక్టర్ నిమ్మల స్వామి, గువ్వల ఉప్పలయ్య, నిమ్మల మధు, గుర్రాల నరేష్, సురేష్, నర్సింగరావు ,మహిళలు పాల్గొన్నారు.

పోచమ్మకు విశ్వబ్రాహ్మణుల బోనం

విశ్వ బ్రాహ్మణులు, ఇతర కులస్తులు ఆదివారం పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. జిల్లా కేంద్రంలోని పోచమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో విశ్వ బ్రాహ్మణులు బోనం చేశారు. ఈ సందర్భంగా విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రామేశ్వర చారి మాట్లాడుతూ.. ఆది నుంచి రాష్ట్రంలో పోచమ్మతల్లికి బోనాలు శ్రావణ మాసంలో విశ్వబ్రాహ్మణులు, కమ్మరి, వడ్రంగి, కంచరీ, శిల్పి, స్వర్ణ కళాకారులు, ఆయా గ్రామాల్లో అమ్మవారికి తొలిబోనం విశ్వబ్రాహ్మణులే చేస్తారన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పూర్తి చేసి, సాయంత్రం ఇతర కులస్తులు బోనాలు సమర్పిస్తారు.

స్టేషన్‌ఘన్‌పూర్ : పోచమ్మతల్లి బోనాలను డివిజన్ కేంద్రం స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లితో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేసి కుటుంబ సభ్యులతో కలిసి గ్రామ శివారులోని పోచమ్మ ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించారు. ఘన్‌పూర్ రైల్వేకాలనీ, శివునిపల్లి, నమిలిగొండ, ఇప్పగూడెం తదితర గ్రామాల్లో బోనాల పండుగను నిర్వహించగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

గ్రామ దేవతలకు మొక్కులు

బచ్చన్నపేట : మండలంలోని పలు గ్రామాల్లో శ్రావణ మాసం సందర్భంగా గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు. ఆదివారం మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్లతో, శివసత్తుల పూనకాలతో అంగరంగ వైభవంగా తరలి వెళ్లారు. పోచమ్మ, పెద్దమ్మ, ఎల్లమ్మలకు బోనాలు చెల్లించి చల్లంగా చూడు తల్లీ అంటూ అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

లింగాలఘణపురం : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పోచమ్మ, మహంకాళమ్మకు బోనాలు చేసి నైవేద్యం సమర్పించారు. అంతకు ముందు ఎడ్లబండ్లతో తలార్లు కట్టి ఆలయాల చుట్టూ తిప్పారు.

ఘనంగా బోనాలు

దేవరుప్పుల : మండల కేంద్రంతో పాటు సింగరాజుపల్లి, సీతారాంపురం, కామారెడ్డిగూడెం గ్రామాల్లో బోనాల పండుగను నిర్వహించారు. సీతారాంపురంలో విదేశీ పర్యటన ముగించుకొని వచ్చిన ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి బోనం ఎత్తుకొని అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు.


పాలకుర్తి: అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

చండిక అమ్మవారికి ప్రత్యేక పూజలు

పాలకుర్తి టౌన్ : పాలకుర్తి మండల కేంద్రంలోని స్వయంభూ చండిక సమేత సోమేశ్వర లక్ష్మినర్సింహస్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా పాలకుర్తి ధర్మరక్షణ సమితి మహిళలు అమ్మవారికి కుంకుమార్చన, ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు. మంగళహారతులతో మహిళలు నీరాజనం సమర్పించారు. అనంతరం ఒకరికొకరు పసుపు, బొట్టు, వాయనాలు, ఇచ్చుకోవడం లలితా సహస్రనామ పారాయణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు దేవగిరి అనిల్ శర్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు